క్లుప్తంగా

హోలీ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



సంగెం : హోలీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై ఎల్.నరేశ్ మండల ప్రజలను కోరారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో ఆదివారం ఆయన మాట్లాడారు. రోడ్లపై ఇతరులకు ఇబ్బందులు కలిగించొద్దని చెప్పారు. సాంప్రదాయ రంగులు మాత్రమే వినియోగించాలని సూచించారు. కళ్లకు, ఒంటికి నష్టం కలిగించే కృత్రిమ, రసాయన రంగులు ఉపయోగించవద్దని తెలిపారు. హోలీ వేడుకల అనంతరం యువకులు, పిల్లలు చెరువుల్లో, బావుల్లో ఈతకు వెళ్లవద్దని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నారావుపేట : నేడు (సోమవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నారావుపేట ఫీడర్ లైన్‌మెంట్ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 33/11 కేవీ, 33/11 కేవి అమీనాబాద్ ఉప కేంద్రాల్లోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నివాళి



రాయపర్తి : మండలంలోని ఆరెగూడేనికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు ఎంగిలి అనిల్ తండ్రి యాకయ్య మృతి చెందగా ఆయన మృతదేహానికి ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అనిల్‌ను, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన మేకల యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి అంబేడ్కర్ సంఘం నాయకులు ఆదివారం రూ.5 వేల నగదు సాయం చేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బిర్రు కుమార్, గారె రాజు, గారె ప్రవీణ్, గారె రమేశ్, తాటికాయల రవీందర్, గారె వీరస్వామి, తాటికాయల సైదులు, గద్దల సతీశ్, ఐత రాజు, అరూరి శ్రీకాంత్, అరూరి రాజశేఖర్, గారె ఉపేందర్, గారె విజేందర్ పాల్గొన్నారు.

జామా మసీదు కమిటీ ఎన్నిక



సంగెం : మండలంలోని గవిచర్లలోని జామా మసీదు కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఇస్మాయిల్ మీడియాకు వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా మహమ్మద్ సాధిక్, ఉపాధ్యక్షుడిగా రఫీ, ప్రధాన కార్యదర్శిగా సర్వర్, సలహాదారులుగా మహబూబ్, సమీర్ పాషా, సభ్యులుగా ఫాజిల్, నిజాం, ముజ్జు, రహీమ్ పాషా ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముస్తఫా, మోయిన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

'మైనారిటీ' ప్రవేశాల గడువు పొడిగింపు

దామెర : తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని పరకాల మైనారిటీ గురుకుల పాఠశాలలో దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడువు పొడగించారని అన్నారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ సీఈసీ, ఎంఈసీలో అన్ని వర్గాల విద్యార్థులకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. 6, 7 ,8 తరగతుల్లో కేవలం మైనారిటీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7995057981, 9989416061,9963802350 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

ఘనంగా 'మట్టల ఆదివారం'

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్, జోజిపేట, చెన్నారావుపేట, నంబర్ వన్ కాలనీ, సూర్యపేట తండా, జల్లి, క్రీస్తునగర్, గురిజాల, తదితర గ్రామాల్లో క్రైస్తవులు మట్టలాధివారపు వేడుకలు ఆదివారం నిర్వహించారు. పూలతో అలంకరించిన ఈత, కొబ్బరి మట్టలను చేతపట్టుకుని వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ సహోదర్ మాట్లాడారు. భక్తులు యేసుక్రీస్తు ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. క్రీస్తు యెరుషలేముకు గాడిద మీద తనను తానుగా తగ్గించుకుని జీవించాలన్నారు. సమాజంలోని ప్రతీఒక్కరు ప్రేమ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమాల్లో అమ్మగారు స్వప్న, వరంగల్ గ్రూప్ సెక్రెటరీ ఆకుల అశోక్‌గౌడ్, పాస్ట్రేట్ సెక్రెటరీ గోపు శ్రీనివాస్‌రెడ్డి, ట్రెజరర్ బండారి భిక్షపతి, మిషన్ అండ్ ఇవాంజలిజమ్ సెక్రెటరీ గట్ల రవీందర్, యూత్ సెక్రెటరీ గట్ల హనోక్, ట్రెజరర్ శంకేశి రంజిత్, స్త్రీల మైత్రి సెక్రెటరీ గాండ్ల మంజుల, ట్రెజరర్ ఆకుల సుభాషిణి, సాంబయ్య, పంథ అనిల్, చిర్ర రవి, మర్రి రమేశ్, కందిక సునిల్, కన్నం భాస్కర్, దేవదాసు, పృధ్వీరాజ్, ప్రవీన్, నవీన్, భద్రు, సింగారపు అశోక్, జయరాం, నాగు, శ్రీను, దేవెందర్, సుమలత, కమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : మట్టలతో ర్యాలీ తీస్తున్న క్రైస్తవులు

సీఎస్ఐ పరితోమా దేవాలయంలో..

నల్లబెల్లి : మండల కేంద్రంలోని సీఎస్ఐ పరితోమా దేవాలయంలో మట్టల ఆదివారాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే క్రైస్తవులు ఆలయానికి తరలివచ్చారు. యేసు సిలువతో ఈత మట్టలను చేతపట్టుకుని భక్తి గీతలు ఆలపిస్తూ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో రెవరెండ్ ఈపీ.ప్రసాద్ దైవసందేశం వినిపించారు. తొలుత సండే స్కూల్ చిన్నారులు యేసు క్రీస్తు పుట్టు పూర్వోత్తరాలు తెలిపేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ప్రార్థనలో పాస్ట్రేట్ సెక్రెటరీ నాగెల్లి ప్రకాశ్, పరికి రత్నం, ఈదునూరి బుచ్చయ్య, కల్లెపల్లి రఘువరణ్, పాడేటి ప్రకాశం, త్యాగరాజు, సంయుక్త, మనుగొండ శ్రీలత, భాగ్య, సువర్ణ, ప్రతిభ, పావని తదితరులు పాల్గొన్నారు.



నల్లబెల్లి : ప్రధాన వీధుల్లో ఊరేగుతున్న క్రైస్తవులు



చెన్నారావుపేట : ప్రార్థన చేస్తున్న సహోదర్

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట : ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో సింగతి మల్లికార్జున్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ డివిజన్ కమిటీ సమావేశంలో రమేశ్ మాట్లాడారు. పాలక పార్టీలు అధికారం దక్కించుకోవడానికి అనేక హామీలు గుప్పించి గద్దెనెక్కి ఆచరణలో విస్మరిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కి మతోన్మాదంతో కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు మోసపూరిత విధానాలతో వస్తోందని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను విస్మరించిన పార్టీలను గద్దె దించాలని కాంక్షించారు. నర్సంపేటలోని స్లమ్ ఏరియాల్లో సమస్యలు నెలకొన్నాయని చెప్పారు. పేదలు నివసించే కాలనీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ), బీఎల్ఎఫ్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు కేశెట్టి సదానందం, కలకోట్ల యాదగిరి, జన్ను రమేశ్, దామ సాంబయ్య, గాజుల వెంకటయ్య, మార్త నాగరాజు, బుడిమె సురేందర్, అలీ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో కాముడి దహనం

రాయపర్తి : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కామ దహన వేడుకలు నిర్వహించారు. 9 రోజులుగా చిన్నారులు, పెద్దలు కోలలు, చప్పట్ల ఆటలు ఆడుతుండగా చివరి రోజు ఆదివారం కాముడి దహనంలో భాగంగా కోలలకు నిప్పంటించి సంబరాలు చేసుకున్నారు. తిర్మలాయపల్లిలో గ్రామస్తులు ఉత్సాహంగా కామ దహనాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ముద్రబోయిన వెంకటేశ్వర్లు, గజవెల్లి రామశేఖర్, చిట్యాల లక్ష్మీనర్సు, మడిపెద్ది యాదగిరి, పారుపెల్లి సురేందర్‌రెడ్డి, వశపాక రాజు, నర్సయ్య, గోలయ్య, రాములు, కట్టయ్య, వెంకటయ్య, గజవెల్లి సాయితేజ, అన్నెపు రాహుల్, లక్ష్మణ్‌రాజ్, ముద్రబోయిన రిషి, ప్రణయ్, ఆరుశ్ మాడెల్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తె మట్టెలకు 'మెపా' తోడ్పాటు

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటకు చెందిన మేక ఇందు-భూమ నాగరాజు వివాహం నిశ్చయం కాగా పుస్తె మట్టెల కోసం ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) ప్రతినిధులు రూ.41,116 నగదు సాయం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ మాట్లాడారు. పేద కుటుంబాలకు చెందిన ఇందు-నాగరాజు వివాహం నేపథ్యంలో తనతోపాటు అసోసియేషన్ బాధ్యులు దండు చిరంజీవి, బొట్టుపెల్లి సంజీవన్, జగన్‌మోహన్ స్పందించినట్లు తెలిపారు. ముదిరాజ్ కులానికి చెందిన పేదలకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పెండ్యాల కృష్ణ, సింగారపు రామకృష్ణ, యాదగిరి, కుమార్, చొప్పరి శోభన్ బాబు, నవీన్, నర్సయ్య, రవి, రాజు, స్వామి, సంపత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న మెపా బాధ్యులు

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



దుగ్గొండి : మండలంలోని కేశవాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు సమిష్టి శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, వేద స్వస్తి వచనముల ద్వార యాగశాల ప్రవేశం, పుణ్యాహవచనం, రక్షాబంధనము, అంకుర్పారణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ నిర్మాణ కర్త కంది జితేందర్‌రెడ్డి-సరళ దంపతులు, కంది తిరుపతిరెడ్డి, మనోహర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు



నగదు, సరుకులు అందజేస్తున్న సీఐ, ఎస్సైలు

గీసుకొండ : ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని సీఐ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోపాల్‌రెడ్డినగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఉడుత శివ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి ఎస్సైలు వెంకన్న, జానీ పాషాలతో కలిసి సీఐ పవన్‌కుమార్ ఆదివారం రూ.5 వేల నగదుతోపాటు క్వింటా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని సీఐ పరామర్శించి మాట్లాడారు. ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు, ఇతర ఎలాంటి బాధలున్నా ఆత్మహత్యలు తగదన్నారు. ఇంటి పెద్ద ఆత్మహత్య చేసుకుంటే కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడికి గాయాలు

చెన్నారావుపేట : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడటంతో బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని లచ్చినాయక్ తండా శివారు భీంమ్లా నాయక్ తండా సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కంకరను చెన్నారావుపేట మండలంలోని ఈర్యతండా క్రెషర్ మిల్లు నుంచి తీసుకెళ్తున్న క్రమంలో డబ్బాలోని కంకరపై కూర్చున్న కత్తి రాజు కుమారుడు హర్షవర్ధన్ మొక్కజొన్న కంకులు తెంపేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఇంజన్ వెనుకాల ఉన్న టైర్ కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగం సాధించిన యువతికి సన్మానం



సౌజన్యను సన్మానిస్తున్న కొమురయ్య, తదితరులు

వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లికి చెందిన సౌజన్య ఆర్టీసీ క్లరికల్ ఉద్యోగం సాధించగా ఆమెను డీఆర్‌డీఏ సీసీ గోలి కొమురయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం ఎక్లోసియా ప్రార్థనా మందిరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీసీ కొమురయ్య మాట్లాడారు. సౌజన్య పట్టుదలతో ప్రయత్నించి ఉద్యోగం సాధించడం అభినందనీయమని తెలిపారు. ఇటీవల జరిగిన గ్రూప్-4 ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసించిన పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా వారిని సన్మానించినట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బిర్రు ఏలియా, గోలి సారమ్మ, గోలి రజిత, స్వరూప, అన్నపూర్ణ, పుల్లయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

బొడ్రాయి వేడుకలు



గూడూరు : మండలంలోని మర్రిమిట్టలో ఆదివారం బొడ్రాయి, హనుమాన్ ఆలయాల వార్షికోత్సవ వేడుకలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ నిర్మాణానికి రూ.2లక్షలు ఆర్థిక సహాయం అందించిన గూడూరుకు చెందిన చీర భిక్షపతి అనే ఉపాధ్యాయుడిని గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకన్న, శ్రీశైలం, పూజెం నరసయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకూ పోరాటం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి

దామెర : ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు అలుపెరగని పోరాటం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి నాయకులను, కార్యకర్తలను కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పార్టీ మండల విస్తృతస్థాయి సమవేశానికి మురళి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీరణ ప్రక్రియ తుదిదశకు చేరుకుందని తెలిపారు. మందకృష్ణ ఆధ్వర్యంలో మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు త్వరలో అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్గీకరణ సాధించుకునే వరకు మాదిగలు ఐక్యంగా ఉండాలని చెప్పారు. సమావేశంలో నాయకులు గజ్జి ప్రదీప్, రవికుమార్, ఈసంపల్లి రాజు, వడ్డెపల్లి సైలాస్‌బాబు, గజ్జి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జి మధుకర్, అధికార ప్రతినిధిగా చిలువేరు సూర్యకిరణ్, ఉపాధ్యక్షుడిగా వడ్డెపల్లి సాగర్, ప్రధాన కార్యదర్శులుగా గజ్జి ప్రదీప్, వడ్డెపల్లి రాజేశ్, కార్యదర్శులుగా గోవిందు విజయ్‌కుమార్, చిలువేరు ప్రవీణ్, సహాయ కార్యదర్శిగా వడ్డెపల్లి రఘుపతి, బొర్ర రాజశేఖర్, ప్రచార కార్యదర్శిగా వడ్డెపల్లి పవన్ ఎన్నికయ్యారు.

వందరోజుల పాలనలో ప్రభుత్వం విఫలం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి

తొర్రూరు : వంద రోజుల పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో బీజేపీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసగిస్తోందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో అత్తా, కోడళ్ల పాలన ప్రజలకు ఏవగింపు తెప్పిస్తుందని, ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి ఊచలు లెక్కబెట్టడం ఖాయమన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ సుంకరనేని కోటేశ్వరరావు, అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు కన్నయ్య, రంగు రాములు, తదితరులు పాల్గొన్నారు.

అటు కొమ్మాల.. ఇటు గిర్నిబావి

- సిద్ధమవుతున్న ప్రభబండ్లు

గీసుకొండ : మండలంలోని సుప్రసిద్ధమైన కొమ్మాల లక్ష్మీనృసింహస్వామి జాతర నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో జాతరకు ప్రభబండ్లను పోలీసులు కొన్ని షరతులతో అనుమతిస్తున్నారు. రాజకీయ పార్టీల జెండాల్లేకుండా ప్రభబండ్లను అనుమతిస్తామని, డీజేలకు అనుమతి లేదని ఇటీవల సమీక్షా సమావేశంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. కాగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీల నాయకులు ప్రభబండ్లను జాతరకు తరలించడానికి ముస్తాబు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా నర్సంపేట నియోజకవర్గం నుంచి ఏటా జాతరకు భారీ సంఖ్యలో ప్రభబండ్లు రావడం పరిపాటి. ప్రధాన పార్టీల నాయకులు పోటాపోటీగా జాతరకు బండ్లను తీసుకొస్తారు. ఈ క్రమంలో మండలంలోని వరంగల్-నర్సంపేట రహదారిలోని కొమ్మాల స్టేజి, దుగ్గొండి మండలంలోని గిర్నిబావి స్టేజి వద్ద నుంచి అధికంగా ప్రభబండ్లు వస్తుండటంతో ట్రాఫిక్ స్తంభిస్తుంది. ఇదిలా ఉండగా మండలంలోని మనుగొండకు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి కొమ్మాల స్టేజి వద్ద సొంత డబ్బుతో సిద్ధం చేస్తున్న ప్రభబండి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



సిద్ధమౌతున్న ప్రభబండి

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం



విజేతలతో రవికుమార్ శోభారాణి, తదితరులు

నర్సంపేట : గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోఅబాకస్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ శోభారాణి తెలిపారు. పట్టణంలోని విజడమ్ హైస్కూల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అబాకస్, చెస్ పోటీలకు ముఖ్యఅతిథులుగా గోక రామస్వామి, విజడమ్ పాఠశాల డైరెక్టర్ జావెద్ హాజరై మాట్లాడారు. నానాటికీ శారీరక శ్రమ, ఆటల పట్ల పిల్లల్లో ఉత్సాహం సన్నగిల్లుతోందని ఆందోళన వెలిబుచ్చారు. తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవాన్ని పెంపొందించేలా కృషి చేయాలని కోరారు. చెస్ పోటీల్లో అర్బాజ్, తౌసిఫ్ అలీ, ప్రణవ్య, అర్మాన్‌షా, అబాకస్ పోటీల్లో అశ్విత, వర్షిత, మనస్విని, దేవాన్ష, వరునిక, సాయితన్వి, సరయు, అల్వినా కుల్సుం, అదీనా జైనబ్, సాయి ఆద్య గెలుపొందగా ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చెస్ క్రీడాకారులు ప్రకాశ్, ప్రవీణ్, సాధినేని సుధాకర్, డాక్టర్ విశ్వనాథ్ నాయక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

సంగెం : మండలంలోని కుంటపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ఎలగోయ లింగయ్య, నాయకులు జున్న దేవేందర్, గోపతి మల్లయ్య, పెంతల సంపత్, ఎరుకల కుమారస్వామి, శంకర్‌లింగం, పెంతల మోహన్, కడ్డురి కుమారస్వామి, గోనె కుమారస్వామితోపాటు సుమారు 50 మంది పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో హనుమకొండలోని ఆయన నివాసంలో ఆదివారం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెంతల ప్రతాప్, నాయకులు జున్న కొమురుమల్లు, యాకయ్య, రమేశ్, జక్క శ్రీనివాస్, కావటి రాజు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

కోల్ యాష్ రవాణాలో జాగ్రత్త తీసుకోవాలి



జరిమానా విధిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

వర్ధన్నపేట : కోల్ యాష్ రవాణాలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా కోల్ యాష్‌ను తరలిస్తున్న లారీలకు ఆదివారం తెల్లవారుజామున పోలీసులు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. జాగ్రత్తలు పాటించకుండా కోల్ యాష్‌ను లారీల్లో రవాణా చేస్తుండడంతో ఇటీవల రాయపర్తి మండల కేంద్రంలో యాష్ రోడ్డుపైకొచ్చి రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందినట్టు తెలిపారు. రాజమండ్రిలో రోడ్డు నిర్మాణ పనులకు రామగుండం నుంచి లారీల్లో జాగ్రత్తలు తీసుకోకుండా కోల్ యాష్‌ను రవాణా చేస్తుండడంతో దుమ్ము రేగి రోడ్డుపై వస్తున్న వాహనాలు కనబడక వడంతోపాటు వాహన చోదకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. యాష్ రవాణా చేసేటపుడు దుమ్ము రేగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్సీ సెల్ మండల కార్యదర్శిగా మధుకర్

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన కొండేటి మధుకర్‌ను కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ మండల కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య తెలిపారు. ఈ మేరకు మధుకర్‌కు నియామక పత్రాన్ని వెంకటయ్య ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మధుకర్ మీడియాతో మాట్లాడారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనను నియమించినందుకు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గబ్బెట బాబు, మల్లెపాక సమ్మయ్య, కందిక ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందచేస్తున్న వెంకటయ్య

'జంగా'కు అభినందనలు

ఐనవోలు : తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవరెడ్డికి ఐనవోలు మండల రెడ్డి సంఘం నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందించి అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. ఆయన్ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు చింతలపూరి హరికృష్ణరెడ్డి, దివాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, బీరం దేవేందర్ రెడ్డి, యాదవ రెడ్డి తదితరులు ఉన్నారు.